క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ శ్రీదేవి తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ బ్యారికేడ్లు, మంచి నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించారు. అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. ఈఓపీఆర్డీ శివయ్య కూడా పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించండి

కార్వేటినగరం: 2021–22 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి రికార్డులను అందించి సోషల్ ఆడిట్‌కు సహకరించాలని ఎంపీడీఓ మోహన్‌మురళీ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను సోషల్ ఆడిట్‌కి అందించి వారి సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఆడిట్ నిర్వహించడానికి స్థానిక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం ఫీల్డు అసిస్టెంట్లు కూడా తనిఖీలో భాగంగా అందుబాటులో ఉంటూ ఎక్కడ అవకతవకలకు చోటు లేకుండా చూడాలన్నారు. అక్రమాలను నెగ్గు దేల్చాల్సిన బాధ్యత డీఆర్పీలదేనని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జాహ్నవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి



మాట్లాడుతున్న హెచ్‌ఎం మనోహర్ నాయుడు

పాలసముద్రం: విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల సహకారం అవసరం ఎంతో ఉందని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనోహర్ నాయుడు తెలిపారు. శనివారం పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇంటి వద్ద విద్యార్థులు ఏమి చదువుతున్నారో గమనిస్తూ ఉండాలన్నారు. వారికి ఎలాంటి పనులు చెప్పకుండా, బాగా చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 10/10 పాయింట్లు సాధించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు కష్టపడుతున్నారని తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కార్వేటినగరం/నింద్ర: ఎమ్మెల్సీ ఎన్నికకు అన్ని వసతులతో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని మండల తహసీల్దార్ షబ్బీర్‌బాషా అన్నారు. శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ బూత్‌ను తహసీల్దార్ సందర్శించారు. అలాగే నింద్ర మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహణకు పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ నాగరాజు అన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ మృతి



యుగంధర్ (ఫైల్)

గంగాధరనెల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న యుగంధర్(45) శనివారం గుండెపోటుతో మరణించాడు. మండలంలోని తూగుండ్రం పంచాయతీ కండిగ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శనివారం ఆయన తన ఇంటి వద్ద మోటార్‌సైకిల్‌పై ఉండగా గుండెపోటు రావడంతో వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం చిత్తూరుకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, రెండు నెలల బాబు ఉన్నాడు. యుగంధర్ మృతి పట్ల ఎంపీడీఓ శ్రీదేవి, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

పుత్తూరు రూరల్: పుత్తూరుకు చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, గర్భిణీని చేసి వదిలిపెట్టిన ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం సీఐ తెలిపిన వివరాల మేరకు.. గత ఫిబ్రవరి 22న స్థానిక లక్ష్మీనగర్ కాలనీకి చెందిన ఓ మహిళ తమ కుమార్తె కిరణ్ సాయి(16)(పేరు మార్చాము) ఉదయం నుంచి కనబడడం లేదని ఫిర్యాదు చేసింది. తన కుమార్తె ఇంటర్మీడియట్ చదువుతోందని, మైనర్ అని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, శనివారం సదరు బాలిక ఇంటికి తిరిగి వచ్చింది. సీఐ ఆ బాలికను తిరుపతికి పంపించి వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భిణి అని తేలింది. దీంతో బాలిక తల్లి శ్రీకాళహస్తిలోని తమ సమీప బంధువైన మిథున్(22) తన కూతురిని తీసుకెళ్లి గర్భిణీని చేసి వదిలిపెట్టినట్లు ఫిర్యాదు చేసింది. దీనిపై ఇన్‌చార్జ్ డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో పోక్సో చట్టం, రేప్ కేసు సెక్షన్ 376 క్లాస్3 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

తూర్పు రాయలసీమ పట్టభద్రల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నగరి డివిజన్‌లోని పట్టభద్రులు ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ నిమిత్తం బందోబస్తులో భాగంగా ఆర్డీఓ సుజన, డీఎస్పీ రవికుమార్‌తో కలిసి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రతి బూత్‌లో నియమించే సిబ్బంది సంఖ్య, బందోబస్తు నిమిత్తం ఉంచే పోలీసుల సంఖ్యపై చర్చలు జరిపారు. పూర్తిస్థాయి భద్రత నడుమ ఓటింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉంటుంది.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ

- పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీఓ, డీఎస్పీ
- ఎన్నికల బందోబస్తుకు 250 మంది పోలీసులు

నగరి: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ బ్యాలెట్ పేపర్ విధానంలో జరగనుంది. ఓటింగ్ విధానం సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌కు భిన్నంగా ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీల గుర్తులతో పాటు ఓటు వేసేందుకు ఈవీఎంలు వినియోగిస్తారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం బ్యాలెట్ పేపర్ విధానం ఉంటుంది. ఇక్కడ ఓటర్లు తమకు ఇష్టమైన అభ్యర్థికి కేటాయించిన గుర్తుపై స్వస్తిక్ సింబల్ ముద్ర వేస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుర్తులు ఉండవు. అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. పేరు ఎదురుగా మొదటి ప్రాధాన్యత నంబరు రాయడం ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది. అలా కాకుండా అక్షరాలు, టిక్‌లు, ముద్రలు వేస్తే ఆ ఓట్లు చెల్లవు. సాధారణ ఎన్నికల్లో ఓటరు ఒకరికే ఓటు వేస్తారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు ప్రాధాన్యం క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేయవచ్చు. ఓటు ఎలా వేయాలనే దానిపై అవగాహన కల్పించేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక పోస్టర్లు రూపొందించింది. ఈ పోస్టర్లను పోలింగ్ కేంద్రాల వద్ద అవగాహన నిమిత్తం ఏర్పాటుచేశారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

- ఆధార్ కార్డు,
- డ్రైవింగ్ లైసెన్సు,
- పాన్‌కార్డు,
- ఇండియన్ పాస్‌పోర్టు,
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్, ప్రైవేట్ ఇండస్ట్రియల్ హౌస్, స్థానిక సంస్థలు ఉద్యోగులకు ఇచ్చిన సర్వీస్ గుర్తింపు కార్డు,
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అందించే కార్యాలయ గుర్తింపు కార్డు
- గ్రాడ్యుయేట్లు, టీచర్లకు విద్యాసంస్థలు అందించిన సర్వీస్ ఐడీ కార్డు, యూనివర్సిటీ అందించే డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్ ఒరిజినల్
- దివ్యాంగులకు ప్రభుత్వం అందించిన గుర్తింపు సర్టిఫికెట్ ఒరిజినల్, భారత ప్రభుత్వం అందించే యూనిక్ డిసేబిలిటీ ఐడీ కార్డు

వీటిలో ఒక గుర్తింపు కార్డులు ఓటు వేయడానికి వెళ్లేటపుడు ఓటరు తీసుకెళ్లాలి

పటిష్ట బందోబస్తు



13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఉంటుంది. డివిజన్ పరిధిలో ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, లోకల్ పోలీస్, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు మొత్తం 250 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. రెండు చెక్‌పోస్టులు ఏర్పాటుచేశాం. బ్యాలెట్ పత్రాలు తీసుకురావడానికి ఎస్కార్ట్ టీం పని చేస్తుంది. పోలింగ్ బూత్‌లోకి ఓటరు ఐడీ కార్డు తప్ప ఏవీ తీసుకురాకూడదు. సెల్ ఫోన్ అనుమతించం. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఐదుగురుకంటే ఎక్కువ మంది గుంపు చేరరాదు.

–రవికుమార్, డీఎస్పీ, నగరి

పోలింగ్‌కు సర్వం సిద్ధం..



ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేశాం. ఎన్నికల సంబంధిత మెటీరియల్ కూడా వచ్చింది. పోలింగ్ స్టేషన్ల అనుగుణంగా విభజించడం జరిగింది. ఆదివారం ఆయా అధికారులకు వాటిని పంపిణీ చేస్తాం. ఇప్పటికే పోలింగ్‌లో పాల్గొనే అధికారులకు శిక్షణ ఇచ్చాం. ఓటర్లు కేవలం పోలింగ్ కేంద్రంలో ఇచ్చిన పెన్‌తో మాత్రమే ఓటు వేయాలి. పోలింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించేలా పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రతి బూత్‌కు ఐదుగురు సిబ్బందిని కేటాయించాం. ఓటర్లకు గుర్తింపుకార్డులు జారీ చేశాం.

–సుజన, ఆర్డీఓ, నగరి

వరి సాగులో మెలకువలు పాటించాలి



రైతు సాగు చేసిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఏఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం: మండల పరిధిలో రైతులు వరి సాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయ అధికారి డిల్లీప్రసాద్ తెలిపారు. శనివారం చెరుముందర కండ్రిగ గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి పొలంలో మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నందున పంటకు నష్టం కలగదన్నారు. పంటలకు ఎక్కువగా పురుగు మందులు వినియోగించవద్దని సూచించారు. వరి, వేరుశనగ పంటకు సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని, తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా తీసుకున్న జింక్ సల్ఫేట్, బోరాన్, జిప్సం ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. నేల సారవంతంగా ఉంటే పంట అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. వరి, వేరుశనగ కోత, నిల్వలో జాగ్రత్తలు, కత్తెర పురుగు యజమాన్యాలపై చర్యలు గురించి వివరించారు. రైతులు సాగు చేసిన వరి పంటను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



రాజమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కుమారస్వామిరెడ్డి



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారు ఎవరూ అధైర్య పడొద్దు.. పార్టీ తరఫున అండగా ఉంటామని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరులు వై.కుమారస్వామిరెడ్డి, వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పుత్తూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మునయ్య తల్లి రాజమ్మ మృతి చెందారు. శనివారం వారు విషయం తెలిసి రాజమ్మ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనో ధైర్యంతో ముందుకెళ్లాలని, మీ కుటుంబానికి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించండి



పాలసముద్రంలో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఓట్లు వేయాలని కరపత్రాలు అందిస్తున్న నాయకులు

విజయపురం/నింద్ర: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గెలిపించాలని మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన నింద్ర, విజయపురం మండలాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం గ్రామ పంచాయతీల్లో పార్టీ కార్యకర్తలతో కలసి పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు.

నగరిలో..

నగరి: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించండి అంటూ రామ్‌ప్రసాద్‌రెడ్డి అని అభ్యర్థించారు. శనివారం అనంతప్పనాయుడు కండ్రిగ, టీఆర్ కండ్రిగ, బాలాజీ గోల్డెన్ సిటీలో ఆయన ప్రచారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరెడ్డిని ఓట్లు వేసి ఆదరించాలని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయ వర్మ అన్నారు. శనివారం వారు మండలవ్యాప్తంగా పర్యటిస్తూ ఓటర్లను కలుసుకున్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ బి.సురేష్

పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ తమిళనాడు సరిహద్దు పల్లిపట్టు కనవ సమీపంలోని ఫారెస్టులో శనివారం ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగు చేసుకుంది. పోలీసుల వివరాలు.. గత రెండు నెలల కిందట ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందాడు. మేకల కాపరులు వ్యక్తి ఉరేసుకున్న విషయాన్ని శనివారం గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. ఎస్‌ఐ బి.సురేష్ మాట్లాడుతూ మృతదేహానికి శవ పరీక్షలు చేయిస్తామని తెలిపారు. వీఆర్‌ఓ తంగరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

మా మనోహరే..

శ్రీకావేరిరాజుపురం పంచాయతీ బోయదు ఇండ్లు గ్రామానికి చెందిన వెంటస్వామి బోయదు కుమారుడు మనోహర్ గత మూడు నెలల క్రితం ఇంట్లో గొడవ పడి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. ఎక్కడా కనిపించ లేదు. అయితే మనోహర్ ఉరేసుకున్న చోట సెల్ ఫోన్, గొడవపడి ఇంటి నుంచి వెళ్లేటప్పుడు తీసుకెళ్లిన ఆస్పత్రి సర్టిఫికెట్లు, పాదరక్షల ఆధారంగా చనిపోయింది మనోహరే అని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు.

జగనన్న కాలనీల్లో శరవేగంగా పనులు



జగనన్న కాలనీల్లో యుద్ధప్రతిపాదికన జరుగుతున్న విద్యుత్ పనులు

శ్రీరంగరాజపురం: జగనన్న కాలనీల్లో శరవేగంగా విద్యుత్ పనులు చేపడుతున్నామని ఏఈ గిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 50 బసివిరెడ్డి పల్లి, అంకనపల్లి, డీఆర్ పురం, చొక్కమడుగు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులపై ఒక్క రూపాయి భారం లేకుండా యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచితంగా సర్వీసు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా వ్యవసాయ సర్వీసులు అందించి, 180 మీటర్ల విద్యుత్ తీగలు, మూడు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఉచితంగా అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి ఉత్సవమూర్తులు

వెదురుకుప్పం: మండలంలోని చిన్నకొమరగుంట గ్రామంలో ఉన్న పద్మావతి ఆండాల్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు జగన్‌మోహన్ ఆధ్వర్యంలో వేకువజామునే సుప్రభాత సేవలో స్వామి వారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ముందుగా స్వామివారిని వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తులకు పూజలు చేపట్టారు.

పరిశుభ్రత పాటించండి



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: పరిశుభ్రత పాటించి అంటురోగాలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని అరవచేనుపల్లిలో శనివారం డెంగీ కేసు నమోదు కావడంతో ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నివాసప్రాంతాలకు దూరంగా పేడదిబ్బలు వేయాలన్నారు. దోమల వల్ల అంటురోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తే దోమలను నివారించవచ్చన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, సీహెచ్‌ఓ మోహనకుమారి, హెల్త్ సెక్రటరి సునీత పాల్గొన్నారు.

కాటన్ దుస్తుల తయారీలో నగరికి ప్రత్యేక స్థానం



కాటన్ చీరలను పరిశీలిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- మంత్రి ఆర్‌కే రోజా



ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆర్‌కే రోజా

నగరి: కాటన్ దుస్తుల తయారీలో నగరి నేతది ప్రత్యేక స్థానమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పంలో నేత సామాజికవర్గం వారిని ఇంటింటికీ వెళ్లి ఆమె కలిశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె నగరిలో నేతన్నలకు అత్యున్నత సహకారం అందిస్తున్న విషయం విదితమే. ఇప్పటి వరకు నగరి చరిత్రలో ఏ నాయకుడు చేయని విధంగా ప్రభుత్వ స్కూళ్ల యూనిఫాం ఆర్డర్లను నగరి నేత కార్మికులకు ఆమె అందించారు. నేత రంగంలో వచ్చిన అత్యాధునిక యంత్రాలపై స్థానిక నేత కార్మికులకు శిక్షణ అందించారు. దీంతో నేత సామాజికవర్గం వారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిమిత్తం తమ ఇళ్లకు విచ్చేస్తున్న మంత్రికి సాదర స్వాగతం పలికి దుశ్శాలువలతో సత్కరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె నగరి నేత కార్మికులు నేసే చీరలు, కాటన్ దుస్తులు, చుడిదార్ వస్త్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. తయారు చేసే వస్త్రాల రకాలు, ముడి సరుకుల దిగుమతి, ఉత్పత్తి చేసే దుస్తుల ఎగుమతి వివరాలపై ఆరాతీశారు. వస్త్రాలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ నగరిలో నేసే కాటన్ చీరలకు, దుస్తులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాష్ట్రంలో పవర్‌లూమ్ నేతపై ఆధారపడి జీవించేవారు నగరి నియోజకవర్గంలోనే అధికంగా ఉన్నారని, వీరు తయారుచేసే వస్త్రాలు ఆకర్షించేలా, నాణ్యతతో ఉంటాయన్నారు. నేత సామాజిక వర్గం అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, బాబు, నాయకులు పురుషోత్తం, బీఆర్వీ అయ్యప్పన్, దయాళన్, జ్యోతి, ముత్తుస్వామి, తులసి, రాజ, కృష్ణమూర్తి, సీకే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రన్

నగరి: ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు అవసరమని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రన్ అన్నారు. శనివారం స్థానిక పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజల ఆరోగ్య పరిస్థితి కోవిడ్‌కు ముందు, కోవిడ్‌కు అనంతరం అనేవిధంగా మారిందన్నారు. సరైన వ్యాయామాలతో పాటు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మానసిక పరిస్థితిని సరిగా ఉంచుకోవడానికి అవసమైన ధ్యానం, యోగాలను పాటించాలన్నారు. సంపాదించే ఆస్తి కన్నా ఆరోగ్యం ముఖ్యమన్న భావన అందరిలో కలగాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యదర్శి మనోహర్, సభ్యులు ఓ.బాలసుబ్రమణ్యం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటి గెలుపునకు కృషి చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అనితారెడ్డి

గంగాధరనెల్లూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు మండలవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేపట్టారు. మండలంలోని బుక్కాపట్నం, పాచిగుంట, పాతవెంకటాపురం, ఆత్మకూరు, ముక్కళత్తూరు, కడపగుంట, కొట్రకోన, చెర్లోపల్లి గ్రామాల్లో ఓటర్లను కలసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. పేర్నాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనితారెడ్డి, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, రైతుభరోసా అడ్వైజర్ కమిటీ అధ్యక్షుడు అంబోదరపల్లి బాబురెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వేలుమొదలియార్, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు బాబునాయుడు, మాజీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, పెద్దారెడ్డి పాల్గొన్నారు.

బీసీల సత్తా ఏంటో లోకేష్‌కు చూపిస్తాం



ఈవీ కన్నాయిరం

నగరి: సరైన సమయంలో బీసీలు, చేనేతల పవర్ ఏంటో నారా లోకేష్‌కు చూపిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత అనుబంధ విభాగం అధ్యక్షుడు ఈవీ కన్నాయిరం ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిని ఉద్దేశించి 'ఏం పీకావురా' అంటూ అసభ్య పదజాలంతో నారా లోకేష్ మాట్లాడడాన్ని తప్పుపట్టారు. మదనపల్లెలో గురువారం జరిగిన యువగళం కార్యక్రమంలో నారాలోకేష్ మాట్లాడిన మాటలను యావత్ బీసీ, చేనేత, వర్గాల తరఫున ఖండిస్తున్నానని తెలిపారు. ఇటీవలే ఆప్కో చైర్మన్‌గా, రాష్ట్ర చేనేత విభాగానికి అధ్యక్షుడిగా గంజి చిరంజీవికి ముఖ్యమంత్రి జగనన్న అవకాశం కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తుండడాన్ని జీర్ణించుకోలేక లోకేష్ ఇలా వాగుతున్నారన్నారు. బీసీల ఆగ్రహానికి గురై లోకేష్ మంగళగిరిలో మరోమారు ఓటమి చవిచూడడం ఖాయమన్నారు. పంచాయతీరాజ్, ఐటీ మంత్రిగా పనిచేసినప్పుడు యువతకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా 'దోచుకో–దాచుకో' అనే సిద్ధాంతంతో లోకేష్ పని చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీల గురించి, చేనేత వర్గాల గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. తాజాగా 11 ఎమ్మెల్సీ స్థానాలని సీఎం జగనన్న బీసీలకు కేటాయించి రాష్ట్రంలోనే బీసీలకు ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు.

ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్లాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ దస్తగిరి

కార్వేటినగరం: విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్తూ లక్ష్యాలను చేరుకోవాలని ఎస్‌ఐ దస్తగిరి అన్నారు. శనివారం స్థానిక లక్ష్మీనరసింహ కళాశాలలో నిర్వహించిన జూనియర్ కళాశాల మొదటి వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమన్నారు. పబ్లిక్ పరీక్షలకు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశల విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అలాగే పలు అంశాలపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్‌ఐ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ధనంజయరెడ్డి, దిలీప్‌కుమార్, పురుషోత్తం, వెంకటేష్, ప్రిన్సిపల్ కిషోర్, ఏఎస్‌ఐ మునికృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు పిచ్చాటూరు సంత రద్దు

పిచ్చాటూరు: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో సోమవారం పిచ్చాటూరులో నిర్వహించే వారపు సంతను రద్దు చేస్తున్నట్లు సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి తెలిపారు. స్థానిక సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ జరగనున్న స్థానిక పాఠశాలను ఆనుకుని సంత జరిగే చోటు ఉండడం వల్ల ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. కూరగాయల సంత రద్దు విషయాన్ని గుర్తించి సోమవారం ప్రజలు ఎవరూ సంతకు రావద్దని విజ్ఞప్తి చేశారు.